www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 19 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8




**నాణ్యమైన విత్తనాలు సరఫరా**

-జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
-తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి

6లో..

# నేడు బిఆర్‌ఎస్ ప్లీనరీ

**-హాజరుకానున్న హరీష్, అజయ్**





ప్రజాపక్షం/ఖమ్మం : భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) ప్లీనరీ ఆదివారం ఖమ్మంలోని మమత ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఆదివారం జరిగే ఈ ప్లీనరీకి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజ్, పలువురు మాజీ శాసన సభ్యులు హాజరు కానున్నారు. ఈ ప్లీనరీకి సంబంధించి జిల్లా నలుమూలల నుంచి బిఆర్‌ఎస్ కార్యకర్తలు తరలి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్లీనరీ జయప్రదం కోరుతూ ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శ, ప్రతి విమర్శ జరుగుతున్న నేపథ్యంలో ప్లీనరీ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

**అజయ్ జన్మదిన వేడుకలు...**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, అజయ్ మిత్రుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జన్మదిన వేడుకలకు సంబంధించి నగరం మొత్తాన్ని భారీ ఫ్లెక్సీలతో అలంకరించారు. మమత ఆసుపత్రి ఆవరణలో జరిగే సభా ఏర్పాట్లను బిఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, అజయ్ వ్యక్తిగత సహాయకుడు చిరుమామిళ్ల రవికిరణ్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మగ్బుల్, సొసైటీ అధ్యక్షులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.



# అంతంత మాత్రంగానే అంగన్‌వాడీల నిర్వహణ..!

-ఎండకారణంగా తెరచుకోని పలు కేంద్రాలు..?
-పర్యవేక్షణ కంటే పైసలు వసూళ్లలో ఆ కొందరు సూపర్‌వైజర్లు...?
-సెక్టార్ మీట్టింగ్‌లో కలెక్షన్ వసూళ్లట...?
-పేరుకే సిడిపిఓ పెత్తనం అంతా ఆ కొందరిదే...?





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వేసవి కాలం ఒక్కపూట నడవాల్సిన అంగన్ వాడీ కేంద్రాలు పలు గ్రామాలలో తెరచుకోకపోగా పలు చోట్ల తెరచుకున్న తూ,తూ మంత్రంగా నడుస్తున్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. అంగన్ వాడీ కేంద్రాల తీరు, తెన్నులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం పై ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సెక్టార్ మీటింగ్ నిర్వహించేది రికార్డుల పర్యవేక్షణ, చిన్నారులకు అందిచాల్సిన పౌష్టికాహారం ఏ విధంగా అందుతుంది, ఇంకా ఎటువంటి మార్పులు చేయాలి, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ, అంగన్వాడి కేంద్రాలలో హాజరు శాతం పెంచడం తదితరాలపై సమావేశం జరగాల్సి ఉండగా వాటన్నిటినీ పక్కన పెట్టి, కొందరు సూపర్వైజర్లు కలెక్షన్ల వసూళ్లలో ఉత్సాహం చూపుతున్నారని, ఆ కొందరి సూపర్వైజర్ల కళ్ళల్లో ఆనందం చూడడానికి మరి కొందరు టీచర్లు లీడర్లుగా పెత్తనం చలాయిస్తూ పైసలు వసూలు చేసి పక్కాగా అందిస్తున్నారని తోటి సిబ్బంది నుండే పెదవి విరుపులు కనిపిస్తున్నాయి. సత్తుపల్లి ప్రాజెక్టుకు ఇన్చార్జి సిడిపిఓగా వ్యవహరిస్తున్న అధికారిని నామ మాత్రంగానే విధులు నిర్వహిస్తున్నారని, పేరుకు మాత్రమే సిడిపిఓ అని పెత్తనం మాత్రం ఆ కొందరి సూపర్ వైజర్ల చేతుల్లోనే ఉందనే విమర్శలు ఆ శాఖ నుండే వినిపిస్తున్నాయి. పలు గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాల్లోని ఆ కొందరు టీచర్లు సరైన సమయపాలన పాటించడం లేదని, ఆ కొందరి టీచర్ల నిర్లక్ష్య ధోరణి వల్లన మంచిగా పనిచేస్తున్న ఇంకొందరి టీచర్లకు ఆటంకంగా మారుతుందని, ప్రశ్నించాల్సిన కొందరు సూపర్వైజర్ల సైతం పైసలు వసూళ్లలో ఉంటున్నారు తప్ప కేంద్రాల పనితీరును మెరుగుపరచడంలో చూపించడం లేదని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ విషయాలపై సిడిపిఓ ను వివరణ కోరెందుకు చరవాణిలో ప్రయత్నించగా పలుమార్లు ఫోన్ చేసినా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. సత్తుపల్లి ప్రాజెక్టు పనితీరు, ఇక్కడ జరుగుతున్న అవకతవకలపై ఏసీబీ విచారణ జరగాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆ కొందరి సూపర్ వైజర్ ల ఖాతాలతో పాటు,కొందరు టీచర్ల బ్యాంక్ ఖాతాలను తనిఖీ చేయాలని అదేవిధంగా కోడిగుడ్లు సైతం నాసిరకంగా, నిబంధనలకు విరుద్ధంగా 30 నుండి 40 గ్రాముల వరకు ఉంటున్న అటు టీచర్లు కాని, ఇటు సూపర్ వైజర్లు కాని పట్టించుకోవటం లేదని సదరు కాంట్రాక్టర్ నుండి భారీగానే ముడుపులు చేతులు మారుతున్నాయని, కాంట్రాక్టర్ సైతం కోడిగుడ్ల నాణ్యతపై ఎవ్వరైనా టీచర్లు ప్రశ్నిస్తే పట్టించుకోవటం లేదని, ఈ విషయంలో కొందరు టీచర్లు సైతం తలలు పట్టుకుంటున్నారని గ్రామాలలో కోడిగుడ్ల నాణ్యతపై ఫిర్యాదులు కొక్కొలలుగా అందుతున్నప్పటికి అవి శాఖలోని అధికారుల వరకు ఎందుకు చేరటం లేదనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సత్తుపల్లి, కల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లపై ఏసిబి అధికారులు తనిఖీలు నిర్వహిస్తే బండారం బట్టబయలవుతుందని ప్రజా సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్ఐఏ నోటీసులు భావ ప్రకటనకు సంకెళ్లు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జాతీయ దర్యాప్తు సంస్థ ఉపా కేసులో సీపీఐ (ఎం ఎల్ మాస్ లైన్) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కు నోటీసు జారీ చేయడం భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవి, జిల్లా సహాయ కార్యదర్శి కె .శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వందలాది మంది హక్కుల కార్యకర్తలు, కవులు, కళాకారులు, ఉద్యమ నాయకులకు ఎన్ఐఏ నోటీసులు జారీ చేస్తూ నిర్బంధ వాతావరణాన్ని సృష్టిస్తుందన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మ ణ్, ఉద్యోగుల సంఘం మాజీ నాయకులు దేవీ ప్రసాద్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నందినీ సిద్ధారెడ్డి వంటి ప్రముఖులకు కూడా నోటీసులు అందడం దారుణమన్నారు. దర్యాప్తు పేరుతో వ్యవహరిస్తున్న ఈ తీరు చట్టబద్ధ పాలనకు విరుద్ధమన్నారు. రాజకీయ స్వేచ్ఛని హరిస్తూ నిరసనలేని పాలనను కేంద్ర ప్రభుత్వం కోరుకుంటుందని ఆరోపించారు. ఎన్ఐఏ పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న హక్కుల ఉల్లంఘనల పట్ల రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. బొంబాయి పేలుళ్ల సందర్భంగా ఉగ్రవాద కార్యకలాపాల నిరోధం కోసం ఏర్పడ్డ జాతీయ దర్యాప్తు సంస్థను దేశంలో వామపక్ష భావజాలం నిరోధానికి కేంద్రం దుర్వినియోగపరుస్తుందని విమర్శించారు. రంగారావుతోపాటు ఇతరులకు అందజేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన సాయిస్ఫూర్తి విద్యార్థులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విభాగం విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్స్ పాల్ డా. వూటుకూరి శేషారత్నకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కళాశాల విద్యార్థుల్లో, ముగ్గురు తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు కేరళలో నిర్వహించిన 5వ దక్షిణాది రాష్ట్రాల నేషనల్ పాలిటెక్నిక్ ఛాంపియన్‌షిప్ 2025 26 వాలీబాల్ పోటీల్లో పాల్గొని జట్టుతో కలిసి మూడవ స్థానం సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులు వి. నవనీత్ కృష్ణ, పి. కిరణ్ వాసు, జె. భవాని వరప్రసాద్ అని కళాశాల కార్యదర్శి దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు హైదరాబాద్ రామంతపూర్‌లో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని మెరుగైన ప్రదర్శన కనబర్చారని ఫిజికల్ డైరెక్టర్ రఘుపతి రెడ్డి చెప్పారు. ప్రిన్సిపాల్ డా. వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, మాట్లాడుతూ విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులు క్రీడలతో పాటు దేశ భక్తిని కూడా పెంపొందించుకోవాలని కోరారు.

## మిట్టపల్లి కృష్ణవేణికి పలువురి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని గాంధిచౌక్‌లో మిట్టపల్లి నాగి, సతీమణి మిట్టపల్లి కృష్ణవేణి అనారోగ్యంతో మరణించారు. మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రేస్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురలీకృష్ణ, మార్కెట్ చైర్మన్ గంగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కట్టా కృష్ణార్జున రావు, వనమా విశ్వేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్, రంగా జనార్ధన్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, ఐదో వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి, 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి , ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, 11వ వార్డు కౌన్సిలర్ దొంతబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, వేముల రత్నాకర్, వీరంశెట్టి సీతారాములు, దార్న రాజశేఖర్, రేచర్ల వెంకటేష్, జవ్వాజి నాగరాజు, జాలాది రామకృష్ణ, మద్దెల రవి, ఏదునూరు శ్రీను, రేచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీలో ఖమ్మం జిల్లాకు సంబంధించి పలువురికి చోటు దక్కింది. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభలు 17,18 తేదీల్లో వరంగల్‌లో జరిగాయి. ఖమ్మంజిల్లా నుంచి యంగళ ఆనందరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కాగా కౌన్సిల్ సభ్యులుగా పగిడిపల్లి ఏసు, యమాల గోపాలరావు లు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన వీరికి పలువురు అభినందనలు తెలియజేశారు.

## మానవతను చాటిన డాక్టర్ రాజశేఖర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల వైద్యునిగా పేరొందిన డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ మరోసారి తన మానవత దృక్పథంతో ఒకరి ప్రాణాలు కాపాడారు. ఫిట్స్‌తో కుప్పకూలిన బాధితున్ని తన వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడాడు. డిసిహెచ్ఎస్‌లో వైద్యునిగా పనిచేస్తున్న రాజశేఖర్ గౌడ్ శనివారం ఖమ్మం నర్సింహాస్వామి గుడి వైపు నుంచి వెళ్తుండగా ఓ వ్యక్తి ఫిట్స్ కారణంగా కింద పడిపోవడం గమనించాడు. వెంటనే కారు దిగి అతని ఆరోగ్య పరిస్థితిని పరీక్షించాడు. రక్తపోటు తో వ్యక్తి తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో తన కారులో అతన్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్య సాయం అందించి ప్రాణాలు కాపాడాడు. ఈ సందర్భంగా తనకు ఎందుకులే అని దగ్గరి వారే ఆపదలో ఉన్న వారిని వదిలేస్తున్న పరిస్థితుల్లో సేవాభావంతో ఒకరి ప్రాణాలను కాపాడిన రాజశేఖర్ గౌడ్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ అరైవ్ ఆలైవ్ రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, సేవాభావం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

## అవినీతిపై విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. శనివారం గోపాలరావు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అవినీతి మయం అయిపోయిందని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణనకు పాల్పడి ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని కార్మికుల జీతాలు ఇవ్వడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ నిర్లక్ష్య సమాధానాలు చెబుతున్నారు. కార్మికులకు రావాల్సిన ఆయిల్, సబ్బులు దుస్తులు వాటికి కుట్టుకూలి బూట్లు కొంతమందికి ఇచ్చి కొంతమందికి ఇవ్వకుండా కార్మికులను చిన్నచూపు చూడడం సరైంది కాదు, ఇప్పటికైనా రాష్ట్ర అధికారులు ఎంక్వయిరీ చేసి వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

## సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు జమలాపురం గ్రామానికి చెందిన కాపర్తి శ్రీనివాసాచారి, పద్మ దంపతులు వారి కుమార్తె మల్లిక, కుమారుడు సాయిగణేష్‌ల వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా కృష్ణప్రసాద్, లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొడాలి విజయలక్ష్మి దేవి, ఉపాధ్యక్షులు గిరిజా లక్ష్మి , ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, ఎల్‌వి నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చింతా కిషక్షర్, కోశాధికారి వీరమాచనేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, మాజీ ఇఓ అల్లూరి విష్ణుమూర్తి, చొప్పవరపు శ్రీనివాసరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు అంగన్వాడి ప్రాజెక్టు పరిధిలోని కల్లూరు, తల్లాడ ,పెనుబల్లి మండలాలకు చెందిన అంగన్వాడి ఉపాధ్యాయులకు స్మార్ట్ ఫోన్ లను సిడిపిఓ నిర్మల జ్యోతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఈ ఫోన్లో పిల్లలు, తల్లులు, పోషణ్ ట్రాకర్, అంగన్వాడి ద్వారా అందిస్తున్న పోషణ, ఆహారం, కోడిగుడ్లు, కురుకురే, బాలామృతం, పిల్లలకు తల్లులకు అందిస్తున్న పోషణ ఆహారం బరువులు,హెచ్చుతగ్గులు పై పూర్తి వివరాలను డేటాను సేకరించి ఫోన్లో అనుసంధానం చేయాల్సిన బాధ్యత అంగనవాడిలపై ఉందని అన్నారు. పోషణను ఆన్లైన్లో పొందుపరచాలని సిడిపిఓ పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ రత్తమ్మ పర్యవేక్షకులు వెంకటమ్మ, భవాని, సుజాత లతోపాటు పెనుబల్లి, తల్లాడ , కల్లూరు, మండలాల పర్యవేక్షకులు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డ్ నిర్మాణం నిలిపివేయాలని వినతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దిపూడి రెవిన్యూలో 81 సర్వే నెంబర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ శనివారం వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌కు 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ, సురేష్, 8వ వార్డు కౌన్సిలర్ చిలకా కోటయ్య, న్యూలిటిల్ ఫ్లవర్ యాజమాన్యం డాక్టర్ భూమేష్, షాజీ, ఏవో నర్సింహారావు వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడం వలన చుట్టుప్రక్కల ఉన్న వ్యవసాయ రైతులకు పాఠశాల విద్యార్థులకు వ్యర్థ పదార్థాలు నుంచి వచ్చే పొగ వలన తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని తక్షనమే ఆలోచన నిలుపుదల చేయాలని కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు





**-కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మేయర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా 17, 30, 31,32, 33, 34, 47 డివిజన్ల పరిధిలోని లబ్దిదారులకు మంజూరైన చెక్కులను మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పేదింట ఆడపిల్లల వివాహం భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు డోన్‌వాన్ సరస్వతి, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు లవన్‌కుమార్, జమాల్, హైమత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 8, 11 డివిజన్లలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను గొల్లగూడెం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ అందజేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, లకావత్ సైదులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతో ఆరోగ్యకరమైన ఆహారం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సేంద్రియ వ్యవసాయ సాగు ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చునని ఆ వైపుగా రైతులు దృష్టిసారించాలని అగ్రి హార్టికల్చర్ సొసైటీ ముఖ్య సలహాదారు నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి పట్టణంలో టిటిడి మహతి ఆడిటోరియంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రకృతి వ్యవసాయదారుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి అగ్రి హార్టికల్చర్ సొసైటీ ముఖ్య సలహాదారు నల్లమల వెంకటేశ్వరరావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సమ్మేళనాన్ని టిటిడి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సమ్మేళనంలో నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని తెలిపారు. సేంద్రియ సాగు వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చునని తెలిపారు. నేలసారాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చునన్నారు. జీవవైవిధ్యాన్ని పెంపొందించడానికి ప్రకృతి వ్యవసాయం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని ఆయన తెలిపారు. రసాయనిక సాగుకు స్వస్తి చెప్పి రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై. వెంకటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సహకులు కోటపాటి గంగాధరం, టి. నాగరాజు, మిల్లెట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# డిలిమిటేషన్‌ను సవరించాలి

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డిలిమిటేషన్‌ను సవరించి అన్ని పార్టీల ఆమోదంతో బిల్లు ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్, డిలిమిటేషన్ బిల్లు రెండింటిని బిజెపి ప్రభుత్వం హడావుడిగా దొడ్డి దారిన నెగ్గించేందుకు కుట్ర పన్నిందన్నారు. ఇట్టి బిల్లును కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో అన్ని విపక్ష పార్టీలను కలుపుకుని నష్టాన్ని వివరిస్తూ అడ్డుకున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దక్షిణాది రాష్ట్రాలకు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా అందరి అభిప్రాయాలను సేకరించి బిల్లు పెడితే ఎవరికి నష్టం జరగకుండా ఉంటుందన్నారు. 2023లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి ఆమోద ముద్ర పొందిందన్నారు. అట్టి బిల్లును మరల తీసుకువచ్చి విపక్ష పార్టీలను, దేశ ప్రజలను మోసం చేసేవిధంగా ఎన్డిఏ ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కలవకుంట్ల గోపాలరావు, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తుమూలూరి లక్ష్మి నర్సింహారావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్‌కుమార్, నగర కాంగ్రెస్ అధికార ప్రతినిధులు బుర్లె లక్ష్మి నారాయణ, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాలు నియంత్రించాలని టౌన్ ఏసిపి ఎస్‌వి రమణమూర్తి అన్నారు. నగరంలో త్రిబుల్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తు పట్టుబడిన వారికి శనివారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అతివేగం, మద్యంసేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, ట్రాఫిక్ సిగ్నాల్స్ పాటించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడం తప్పనిసరి అన్నారు. అరైవ్‌అలైవ్ ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చురుకుగా సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏసిపి వెంట టూటౌన్ సిఐ బాలకృష్ణ, ఎస్సై ఉన్నారు.

# ట్రాఫిక్ పోలీసుల 'అరైవ్ అలైవ్'




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని బాటా సెంటర్‌లో శనివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్‌అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటు బెల్ట్ ప్రముఖ్యతను వివరించారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తుంటారని గ్రహించి సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం పొందటంతో వారి కుటుంబ దిక్కును కోల్పోయి అచేతన స్థితిలో మిగిలిన వారు ఎందరో ఉన్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సిఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది, ఆటోడ్రైవర్లతో పాటు వాహన చోదకులు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రఘునాథపాలెం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజలతో పాటు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. కారు, ఇతర వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, అతివేగంగా, సిగ్నల్ జంపింగ్ చేయరాదని, రాంగ్ రూట్‌లో ప్రయాణించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తారక రామా ఆటో నగర్ ఎఫ్‌సిఐ బైపాస్ రోడ్డు నందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. శనివారం శ్రీ కాణిపాక విఘ్నేశ్వర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని కమిటీ అధ్యక్షులు కనకం రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కాణిపాక విఘ్నేశ్వర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో పాదాచారులకు, వాహనదారులకు దాహార్తిని తీర్చేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో తారక రామా ఆటో నగర్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జునరావు, డైరెక్టర్లు గంగవరపు శ్రీనివాసరావు, గుజ్జుల వెంకటరెడ్డి, పగడం ప్రసాద్, కేసగాని రవి, కె. శ్యామేందర్‌రెడ్డి, పబ్బు భాస్కర్, ఫోర్ వీల్ ఆటో టెక్నీషియన్స్ అధ్యక్షులు ఎస్‌కె పాషా, తిరుపతిబాబు, ఎం. మహేష్, గన్న శ్రీనివాసరావు, టెక్నీషియన్స్ ఎస్‌కె బాబు, పూర్ణ, పాషా, ఉపేందర్, నాగేశ్వరరావు, చక్రధర్, మంగారావు, రషీద్, రాజు, రాము, సైదాచారి, బ్రహ్మం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన నలుగురు లబ్దిదారులకు రూ.1.52,500/ విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ అబ్దుల్ నబీ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ నబీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు.తమకు చెక్కులు మంజూరీకి కృషిచేసిన ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క కు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులవంచ సహకార సంఘం మాజీ డైరక్టర్ ఆళ్ల శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ కంచుమర్తి నరేష్, సీనియర్ నాయకులు కాశి, కొమ్ము ప్రసాద్, షేక్ జాన్‌పాషా, షేక్ వహీద్ , లబ్దిదారులు పాల్గొన్నారు.

# చింతకానిలో చలివేంద్రాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/చింతకాని :** వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చింతకాని గ్రామపంచాయతీ ముందుకొచ్చింది. శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సర్పంచ్ కిలారు మనోహర్‌బాబు, తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌లు ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలు ద్వారా పాదచారులు,కూలీలు, రైతులు చల్లని నీటిని సులభంగా పొందే అవకాశం కలిగింది. ఈసందర్బంగా తహసీల్దార్ బాబ్జీప్రసాద్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటికొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. చింతకాని గ్రామపంచాయతీ చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సర్పంచ్ మనోహర్ బాబు మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పగటి సమయంలో ఇండ్లలోనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ సూపరెండెంట్ జానీ మియా, యూడీసీ వేణు, గిర్దావర్ జగదీష్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, వార్డు సభ్యులు పొనుగోటి బాబు, కిలారు బాబురావు, షేక్ రహమతుల్లా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన 2వ వార్డు కౌన్సిలర్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఏదులాపురంమున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు స్వరూప శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో వార్డు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకుడు ఏనుగు మహేష్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేరండి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది



ప్రజాపక్షం/కారేపల్లి:గుంపెల్లగూడెం గ్రామంలో నిర్వహించిన బడిబాట అవగాహన కార్యక్రమంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు ముఖ్యంగా మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు వంటి సదుపాయాలు ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయని తెలిపారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాకులు అజ్మీర శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతున్నదని, తల్లిదండ్రులు ఈ అవగాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా గ్రామ స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, పంచాయితీ సెక్రటరీ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు హరీష్, సమ్మయ్య, ఉమా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కుక్ పోస్టుకు ధరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/పాల్వంచ : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ( కేజిబివి )లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీ చేసేందుకు అర్హత కలిగిన స్థానిక మహిళ అభ్యర్థుల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మండల విదాధికారి శ్రీరాంమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహిళా అభ్యర్థులై ఉండి, ఏడవ తరగతి ఉత్తీర్ణత, 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయసు కలిగిన వారు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు వారి ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ ఆఫీసర్‌చే అటెస్టెడ్ చేయించి ధరఖాస్తుతో పాటు ఈ నెల 20వ, తేదీ నుండి 22 బుధవారం సాయంత్రం 5 గంటల లోపు పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాణి సూచించారు.

## విబి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన విబి రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దరించి అమలు చేయాలని బికేఎంయు జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. మండల పరిధి నారాయణరావుపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం యన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలు, మధ్య తరగతి ప్రజలు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని గత 20 సంవత్సరాల క్రితం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత పాలకులు అమలు చేసిన విధానాలను రద్దు చేసి ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, నారాయణరావు పేట సర్పంచ్ బండ సరస్వతి, ప్రజా సంఘాల నాయకులు మేకా రాంబాబు, గుర్రం నాగయ్య, గంగుల సత్యనారాయణ రెడ్డి, చింతా ప్రశాంత్, పొదిలి వెంకటేశ్వర్లు, పొదిలి భద్రయ్య, గుర్రం నాగలక్ష్మి, చాగల జోగమ్మ, పొదిల కరుణ, తమ్మళ్ళ సాయమ్మ, మేకా సుశీల పాల్గొన్నారు.

## సీహెచ్సీలో కాయకల్ప బృందం క్షేత్ర స్థాయి పరిశీలన



ప్రజాపక్షం/నేలకొండపల్లి : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను శనివారం కాయకల్ప బృందం పరిశీలించింది. వైద్య విధాన పరిషత్ అధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్. ప్రియదర్శిని ల బృందం ఆకస్మికంగా పరిశీలించింది. హస్పిటల్ లోని పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనీఖీ చేశారు. రోగులకు అందుతున్న ఆహారం నాణ్యత ను పరిశీలించారు. రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ, ఎన్ని రకాల మందులు ఉన్నాయి. ఎంత మందికి అందిస్తున్నారు. ప్రతీ రోజు ఓపీ ఎంతంటుంది. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హస్పిటల్ లో పారిశుద్ధం ను పరిసరాలు తిరిగి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను "నిర్వహించారు. కాయకల్ప కు అవసరమైన సౌకర్యాలు గురించిచర్చించారు. వైద్య సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్.కె.రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాపక్షం/ కొత్తగూడెం : మే 13న నిర్వహించే పాలీసెట్‌కు రుద్రమ్‌పూర్ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుండి మే 12వ తేది వరకు జరిగే ఈ ఉచిత శిక్షణ ద్వారా విద్యార్థులు ప్రవేశ పరీక్షకు సమర్ధవంతగా సిద్ధమయ్యేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. 10వ తరగతి పాస్ ఆయిన విద్యార్థినీ విద్యార్థులు ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు పాలీసెట్‌ను ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. డిప్లొమా కోర్సులు చదవడం ద్వారా చక్కటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, పాలిటెక్నిక్ పూర్తి చేసిన అనంతరం బిటెక్‌లో నేరుగా ద్వితీయ సం.లో చేరవచ్చని చెప్పారు. పూర్తి వివరాల కోసం 7989103692 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## మానసిక వేదనలో చిన్న కాంట్రాక్టర్లు

# కాంట్రాక్టర్లకు బకాయిల భారం

**-సంవత్సరాలుగా రావలసిన లక్షలాది రూపాయలు నిలిచిపోయిన వైనం**
**-నిద్రలేని రాత్రులు..అప్పుల ఒత్తిడి..కుటుంబాలపై తీవ్ర ప్రభావం**




ప్రజాపక్షం/కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు కూసుమంచి మండలంలోని అనేక గ్రామాల్లో, తండాల్లో పలు రకాల అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు సంవత్సరాలుగా తమకు రావలసిన బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, చిన్నపాటి భవనాలు, పంచాయితీ పనులు, తాగునీటి లైన్లు, సీసీ రోడ్లు వంటి పనులు పూర్తి చేసి అప్పగించినప్పటికీ కొందరికి కోట్లలో మరికొందరికి లక్షలాది రూపాయల బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదని వారు ఆరోపిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నామని, ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో వడ్డీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కొందరు కాంట్రాక్టర్లు తమ ఇళ్లు, భూములు తాకట్టు పెట్టి పనులు చేసినట్లు, బిల్లులు వస్తాయని నమ్మకంతో కార్మికులకు, సరఫరాదారులకు ముందుగానే డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. పని చేశాం, అధికారుల ఆదేశాలతో సమయానికి పూర్తి చేశాం..కానీ ఇప్పుడు బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు అని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నెలల తరబడి కార్యాలయాల చెట్టూ తిరుగుతున్నా స్పష్టమైన సమాధానం రావడం లేదని, ప్రతి సారి త్వరలో వస్తాయి అనే మాటలతోనే పంపిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. బిల్లులు రాకపోవడంతో కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని, సరఫరాదారులు ఒత్తిడి తెస్తున్నారని, కొందరు కాంట్రాక్టర్లు అప్పుల బాధతో కుటుంబ సమస్యలను ఎదుర్కొంటున్నారని సమాచారం. చిన్న స్థాయి కాంట్రాక్టర్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని, చాలా మంది కొత్త పనులు తీసుకునే పరిస్థితిలో కూడా లేరని అంటున్నారు. ఇదిలా ఉండగా, అభివృద్ధి పనులు వేగంగా సాగాలంటే కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాల్సిన అవసరం ఉందని ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. బకాయిల చెల్లింపుల్లో ఆలస్యం వల్ల భవిష్యత్తులో పనులపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని, సంబంధిత శాఖాధికారులను, ప్రజాప్రతినిధులను వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులపై స్పష్టమైన గడువు ప్రకటించాలని, లేకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి వస్తుందని తెలుస్తోంది.

## కాలేయాన్ని కాపాడుకుందాం

**నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం**

# ఆరోగ్యంగా జీవిద్దాం



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ప్రపంచ కాలేయ దినోత్సవం(డబ్ల్యుఎల్‌డి) అనేది సాధారణ ప్రజలలో కాలేయ వ్యాధిపై అవగాహన పెంచే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19న జరుపుకునే ఒక ప్రపంచ ఆరోగ్యకార్యక్రమం. ఈ ఆరోగ్య అవగాహన దినోత్సవం నాడు నిర్వహించే కార్యాక్రమాలను వివిధ అంతర్జాతీయ మరియు స్థానిక పాలక బృందాల సంఘాలతో కలిసి నిర్వహిస్తారు. ప్రపంచ కాలేయ దినోత్సవం కాలేయ వ్యాధుల తీవ్రత, ముందస్తు గుర్తింపు మరియు నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యకలాపాలపై దృష్టి పెడుతుంది. మానవ శరీరంలో రెండవ అతిపెద్ద మరియు అత్యంత కీలకమైన అవయవమైన కాలేయం, జీవక్రియ, జీర్ణక్రీయ, రోగనిరోధక శక్తి, విషపదార్థాలను వడపోత, మరియు విటమిన్లు, ఖనిజాలు, గ్లూకోజ్ మొదలైన వాటి నిల్వతో సహా అనేక విధులను నిర్వర్తిస్తుంది. కాలేయానికి స్వయంగా బాగుచేసుకునే ప్రత్యేక లక్షణం ఉన్నప్పటికీ, అంటే అది 60 నుండి 70 శాతం వరకు దెబ్బతిన్న తర్వాత తిరిగి పెరగగలదు లేదా పునరుత్పత్తి చెందగలదు. కాలేయంలో ఏవైనా అసాధారణలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు.

### ప్రపంచ కాలేయ దినోత్సవం ప్రాముఖ్యత

ప్రపంచవ్యాప్తంగా, ప్రతి సంవత్సరం సుమారు 20 లక్షల మంది కాలేయ వ్యాధుల కారణంగా మరణిస్తున్నారు. వీటిలో కాలేయ సిర్రోసిస్ సంబంధిత కారణాల వల్ల సగం మరణాలు సంభవిస్తుండగా, మిగిలినవి వైరల్ హైపటైటిస్ మరియు హెపటోసెల్యులార్ (కాలేయ) క్యాన్సర్ వల్ల సంభవిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే మొత్తం మరణాలలో 3.5శాతం సిర్రోసిస్ మరియు కాలేయ క్యాన్సర్ వల్లే సంభవిస్తున్నాయి. ప్రస్తుతం మరణానికి గల కారణాలలో సిర్రోసిస్ 11వ అతిపెద్ద కారణంగా ఉండగా, కాలేయ క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా 16వ మరియు భారతదేశంలో 10వ ప్రధాన కారణంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా మద్యం సేవించే వారి జనాభా సుమారు 200 కోట్లు కాగా, వీరిలో 7.5 నుండి 10 కోట్ల మందికి మద్యం సంబంధిత కాలేయ వ్యాధుల ప్రమాదం ఉంది. దీనికి అదనంగా, 200 కోట్ల మంది వయోజనులు ఊబకాయం/అధిక బరువుతో, 10 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. ఇవి నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్( ఎన్ఏఎఫ్ఎల్‌డి) మరియు హెపటోసెల్యులార్ కార్సినోమాకు ప్రమాద కారకాలుగా పరిగణించబడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వైరల్ హెపటైటిస్ ప్రాబల్యం అధికంగా కొనసాగుతున్నప్పటికీ, ఔషధాల వల్ల కలిగే కాలేయ గాయం తీవ్రమైన హెపటైటిస్‌కు ప్రధాన కారణంగా మారుతోంది. 2005తో పోలిస్తే 2030 నాటికి ఏటా కొత్త కేసులలో 35శాతం పెరుగుదల ఉంటుంది. వ్యాధి తీవ్రత, దానితో ముడిపడి ఉన్న ప్రమాద కారకాలు మరియు నివారణపై అవగాహన లేకపోవడం వల్లే ఈ సంఖ్యలలో పెరుగుదల కనిపిస్తోంది. ఈ రోజున, ఆరోగ్య సంరక్షణ విధాన రూపకర్తలు మరియు ప్రవేట్ హెపటాలజిస్టులు/హెపటో ఆంకో సర్జన్లతో సహా, కాలేయ వ్యాధి ప్రమాదం మరియు ఆహారం, జీవనశైలి మార్పులతో సహా దాని నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ముందుకు వస్తారు. అంతేకాకుండా, చాలా కాలేయ వ్యాధులకు ఎటువంటి లక్షణాలు కనిపించవు కాబట్టి, కాలేయ వ్యాధి లక్షణాలు మరియు దానిని ముందుగానే గుర్తించడం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలు మరింత తెలుసుకోవడానికి ప్రపంచ కాలేయ దినోత్సవం ఒక అవకాశాన్ని కల్పిస్తుంది.

### ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారాన్ని తీసుకోండి



ప్రోటీన్ మరియు ఫైబర్ అధికంగా ఉండే ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారాన్ని తీసుకోండి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి క్రమం తప్పని వ్యాయామం మరియు ధ్యానం తప్పనిసరి చేయండి. మద్యపానం మరియు ధూమపానం మానుకోండి. స్వీయ వైద్యం మానుకోండి. సమయానికి టీకాలు వేయించుకోవడం, ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోండి. కలుషితమైన సూదులను పంచుకోవడం మరియు అసురక్షిత లైంగిక సంబంధం పెట్టుకోవడం మానుకోండి.

**-మెడికల్ గ్యాస్ట్రో ఏంటరాలోజిస్ట్ డాక్టర్ ముదిరెడ్డి అనిమేష్‌రెడ్డి**
**-ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్, ఖమ్మం**

### కాలేయాన్ని కాపాడుకుందాం



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కాలేయం. ఇది శరీరాన్ని డిటాక్స్ చేయడం, జీర్ణక్రియ ను మెరుగుపరచడం వంటి ముఖ్యమైన పనులు చేస్తుంది. అయితే, ఆధునిక జీవనశైలి, జంక్‌పుడ్, మద్యం సేవించడం వల్ల కాలేయ సమస్యలు పెరుగుతున్నాయి. ఈ వరల్డ్ లివర్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ కాలేయాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం, వ్యాయామం, రెగ్యులర్ చెకప్‌లను పాటించాలి. ఆరోగ్యకరమైన జీవితం మన చేతుల్లోనే ఉంది. ఖమ్మంలో నేడు ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్ ను అన్ని సదుపాయాలతో ప్రారంభిస్తున్నాం. నాణ్యమైన, నమ్మకమైన గ్యాస్ట్రో వైద్యసేవలను 24/7 అందజేసేందుకు మా టీం సన్నద్ధంగా ఉంది. ఖమ్మం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు మా సేవలు సద్వినియోగించుకోవాలని ఆకాంక్షిస్తున్నాం.

**-శ్రీ రక్ష హాస్పటల్స్ అధినేత,**
**-ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు**

# కొనుగోలు కేంద్రాలు కొందరికేనా.. అందరికీనా..?

**-బోనకల్ మండలంలో రైతుల వివక్షపై ఆరోపణలు**
**-26క్వింటాళ్ల నిబంధనపై తీవ్ర విమర్శలు**



ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ మండలంలో మొక్కజొన్న రైతుల పరిస్థితి రోజురోజుకి ఆందోళనకరంగా మారుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు కొందరికేనా.. లేక మండలంలోని ప్రతి రైతుకూ సమానంగా అందుబాటులో ఉండాలా అనే ప్రశ్న ఇప్పుడు రైతు బిడ్డల గుండెల్లో మంటగా మారింది. పరిస్థితులను పరిశీలిస్తే అధికార పక్షం పాత్ర లేదని చెప్పడం కష్టమే అన్న అభిప్రాయం గ్రామాల నుంచి వినిపిస్తోంది. మండంలోని 22 గ్రామపంచాయతీల్లో పత్తి పంట ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు మార్పు దిశగా మొక్కజొన్న సాగు వైపు మెగ్గు చూపారు. ప్రభుత్వం కూడా రైతులకు మీ పంటలు కొనుగోలు చేస్తాం అంటూ హామీలు ఇచ్చింది. కాని ఆ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయన్న భావన రైతుల్లో పెరుగుతోంది. ఎందుకంటే మొత్తం మండలానికి కేవలం మూడు కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేయడం రైతులను తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఆ మూడు కేంద్రాలు ఉన్న గ్రామాల రైతులకే సౌకర్యం కలగగా, మిగితా గ్రామాల రైతులు తమ పంటను అమ్ముకోవడానికి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. రావినూతల, ముష్టికుంట్ల, పెద్దబీరవల్లి వంటి గ్రామాల్లో రైతులు మేము పండించిన పంట ఎక్కడ అమ్మాలి అని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే మరో పెద్ద సమస్యగా 26క్వింటాళ్ల పరిమితి నిబంధన మారింది. ఒక రైతు ఎంత కష్టపడి పండించినా 26క్వింటాళ్లకే పరిమితం చేయడం ఏ రకమైన విధానం ఇది రైతును ఆదుకునే విధానమా లేక రైతును నష్టపరిచే విధానమా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిబంధనల వల్ల చిన్న రైతు, పెద్ద రైతు అన్న తేడా లేకుండా అందరూ ఇబ్బందులు పడుతున్నారు. రైతుల పట్టాదార్ పాస్ బుక్ ఉన్నా పంట ఉన్నా అమ్ముకునే అవకాశం లేకపోతే ఆ పత్రాల ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలు రైతు బతుకును బలోపేం చేయాలి కాని బలహీనపరచకూడదని వారు అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండేలా కొనుగోలు కేంద్రాలను పెంచాలని, 26క్వింటాళ్ల నిబంధనను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల కష్టానికి విలువ ఇవ్వాలంటే మాటలు కాదు చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు.

# తునికాకు రేటుపై కుదిరిన ఒప్పందం

**- యాబై ఆకుల కట్టకు 3రు.42పైసలు**



ప్రజాపక్షం/గుండాల : మండలపరిదిలోని కాచనపల్లి పంచాయితీలో శనివారం నాడు తునికాకుసేకరణకు సంబందించిన కాంట్రార్టర్లు, ప్రజలు, ప్రజాప్రతినిదులు , తునికాకు పోరాటకమిటి మద్య జరిగిన చర్చలో గత సంవత్సరం 50ఆకుల కట్టకు 3రు.31పైసలు ఉండగ , ఈ సంవత్సరం 11పైసలు అదనంగా పెంచారు. ప్రభుత్వం 50 ఆకుల కట్టకు 3రు.40పైసలు పెంచగా తునికాకు పోరాట కమిటి కాంట్రాక్టు మరో రెండు పైసలు పెంచాలనే డిమాండ్ చేయగా అందుకు కాట్రాక్టర్లు అంగీక రించారు. అలాగే కల్లేదార్ల కమీషన్, హ్యాడ్లింగ్‌చార్జీలను పది శాతం అదనంగా పెంచారు. తునికాకు సేకరణ సమయంలో ప్రమాదానికి గురౌన వారికి కాంట్రాక్టులు ప్రథమ చికిత్స చేయించాలని , మెరుగైన వైద్యకోసం వాహన సదుపాయం కల్పించాలని అగ్రిమెంటును కుదుర్చుకున్నారు. ఈ ఒప్పదం ఈ మండలాలకు మాత్రమే గుండాల, ఆళ్ళపల్లి, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ, లక్ష్మి దేవిపల్లి, ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ఇల్లందు , బయ్యారం, గంగారం, పాకాల, గూడూరు, మహబాద్. ఈ కార్యక్రమంలో కాట్రాక్టర్లు మెహమ్మద్ అబ్దుల్ , రెహమాన్, అతహుల్, రెహమాన్, సైఫుద్దీన్, సంపత్‌రెడ్డి, నాగరాజు, ముంతజీమ్ ఖుద్దూస్, అజ్జు, వివిద పార్టీల నాయకులు రేసుఎల్లయ్య, అవునూరిమధు, సాగర్, మాచర్ల సత్యం, తుపాకుల నాగేశ్వరావు, ముక్తి సత్యం, జర్పుల కిషన్, ఉక్లా, వాగబోయిన రమేష్, కొమరం శాంతయ్య, గోవింద నరసింహారావు, పూనెం శ్రీను, తోలెం గోపి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు గ్రామీణ జీవనానికి మూలాధారం

**-పూర్వీకుల జలవ్యవస్థలలో ఉన్న శాస్త్రీయత**
**-పునరుద్ధరణ అవసరం:రైతుల విజ్ఞప్తి**





ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండలంలో చెరువులు, కుంటలు కేవలం నీటి నిల్వలుగా కాకుండా గ్రామీణ జీవనానికి కీలక ఆధారాలుగా నిలిచాయి. పూర్వీకులు వర్షాధార వ్యవసాయానికి తోడుగా ఈ జలవనరులను సమర్థంగా వినియోగిస్తూ గొలుసు చెరువుల వ్యవస్థను అభివృద్ధి చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో వివిధ గ్రామాలలో గ్రామానికి కనీసం ఐదు నుండి పది నీటి గుంటల వరకు ఉండేవి కూడా ఈ విధమైన కుంటలు ఒక గొప్ప జల వ్యవస్థగా ఉండేవి. ఒక చెరువు నిండితే మిగిలిన నీరు మరో చెరువుకు వెళ్లేలా ఏర్పాట్లు చేయడం, కాలువల ద్వారా పొలాలకు నీరు పంపించడం వంటి విధానాలు శాస్త్రీయంగా అమలు చేశారు. దీంతో విద్యుత్ అవసరం లేకుండానే సాగు సాగేది. చెరువుల ద్వారా భూగర్భ జలాలు కూడా పెరిగి, బావుల్లో నీటి మట్టం నిలకడగా ఉండేది. పూర్వం గ్రామాల్లో ఐదు నుండి పది వరకు కుంటలు ఉండి, వాటి సంరక్షణను గ్రామస్తులే బాధ్యతగా తీసుకునేవారు. తక్కువ నీటితో పెరిగే పంటలను పండించడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించేవారు. ప్రస్తుతం బోర్‌వెల్స్ వినియోగం పెరగడంతో భూగర్భజలాలు తగ్గిపోతుండగా, వర్షాభావం సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పూర్వీకుల చెరువుల వ్యవస్థలను పునరుద్ధరించి, సంరక్షణపై దృష్టి పెట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

## యాసంగి వరి కొనుగోళ్లు సమర్ధవంతంగా నిర్వహించాలి



ప్రజాపక్షం/ కొత్తగూడెం : యాసంగి ధాన్యం కొనుగోళ్లను సమర్ధవంతంగానిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. జిల్లాలో సుమారు 83 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వ్యవసాయ ధికారులు, విస్తరణాధికారులు నాణ్యతా ప్రమాణాల ప్రకారం పరిశీలించి కొనాలని చెప్పారు. రైస్ మిల్లర్లు రైతులు తెస్తున్న పిఆర్ 126 రకం పట్ల అసతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ రకంలో పిన్ పాయింట్ డ్యామేజ్ సమస్య కారణంగా ఎఫ్‌సిఐ వద్ద బియ్యం ఆమోదం పొందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. దీనిపై సరైన చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, ఎండలు తీవ్రంగా ఉన్నాయని, రైతులు ఎండలో రాకుండా ధాన్యాన్ని చల్లబడిన తర్వాత తీసుకురావాలని సూచించారు. రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతికి అవసరైన హమాలీల, గోదాము స్థలాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు వరి కొనుగోలు సిబ్బందికి శిక్షణ అందించి సమన్వయంతో పని చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి విద్య చందన, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ త్రినాధ్ బాబు, జిల్లా సహకార అధికారి రాజశేఖర్, ఎఫ్‌సిఐ అధికారులు, వెంకటరత్నం, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి : డిఎస్‌పి




ప్రజాపక్షం/ కొత్తగూడెం : ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారకు సహకరించాలని డిఎస్‌పి ఆదినారాయణ అన్నారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు శనివారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వాహన దారులకు వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా ప్రకృతి వైపరిత్యాలతో మృతి చెందే వారి కంటే రోడ్డు ప్రమాదాల కారణంగా మరణించే వారి సంఖ్య పెరుగుతుందని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడంలో ప్రతీ ఒక్కరూ స్వీయ క్రమ శిక్షణను కలిగి ఉండాలని కోరారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించడం వల్ల ప్రాణాలను కోల్పోకుండా ప్రమాదాల నుండి బయటపడతామని తెలిపారు. ప్రజల భద్రత, శ్రేయస్సు కోసమే పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని, ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి బాధ్యత గల పౌరులుగా మెలగాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతీ ఒక్కరితో ప్రతిజ్ఞ చేసిన అనంతరం సీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం త్రి టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో 1,2 టౌన్ సిఐలు కరుణాకర్, ప్రతాప్, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్, ఇదత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతను బాధ్యతగా పాటించాలి

**-కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు**



ప్రజాపక్షం/కూసుమంచి: రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పాటించాలని కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజులు సూచించారు. శనివారం మండల పరిధిలోని గట్టుసింగారం రోడ్డు నందు భద్రత నియమాలపై కూసుమంచి పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాంగ్ సైడ్ డ్రైవింగ్, అపోజిట్ దిశలో వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్ వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, అది కేవలం జరిమానా భయంతో కాకుండా ప్రాణ రక్షణ కోసం అవసరమని వివరించారు. అలాగే వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 24వ రోజుకు చేరిన కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు




ప్రజాపక్షం/బూర్గంపాడు: కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 24వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా కార్మికులకు మద్దతుగా సూరిశెట్టి జగదీష్, సంద్రాల పవన్ కుమార్, గుగులోత్ శంకర్(సారపాక సేవాలాల్ సేవ టౌన్ ఉపాధ్యక్షులు)పాల్గొన్నారు. దీక్షను ఐటీసీ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్, బీఆర్‌టీయూ అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, కో కన్వీనర్, బీఎంఎస్ అధ్యక్షులు బిజ్జం అశోక్‌రెడ్డి పూలమాల వేసి ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల 14వ వేతన ఒప్పందంపై చర్చలు జేఏసీతో జరపాలని డిమాండ్ చేశారు. లేదంటే 4,000 మంది కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఆకినీ సర్వేశ్వరరావు, బల్లం నాగయ్య, ఆకినీ చంద్రరావు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఎల్ఆర్‌డబ్ల్యూఎస్ నైపుణ్యం సాధించాలి : ఎంఈవో జయరాజు



ప్రజాపక్షం/కారేపల్లి: ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం(ఎల్ఆర్‌డబ్ల్యూఎస్)నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు సూచించారు. పేరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎద్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా విద్యార్థుల పఠనంలో గణనీయమైన పురోగతి సాధించారని తెలిపారు. ప్రారంభంలో 15 నుండి 18శాతం మాత్రమే చదవగలిగిన విద్యార్థులు ప్రస్తుతం 82శాతంకు చేరడం ఉపాధ్యాయుల కృషి ఫలితమని అన్నారు. ఇండిపెండెన్స్ డే నాటికి 100శాతం పఠన లక్ష్యం సాధించాలని సూచించారు. చదవడమే కాకుండా అర్థం చేసుకోవడం, ప్రవాహంగా మాట్లాడటం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు సరఫరా

-వానాకాలం సాగుకు పూర్తి సన్నద్ధత
-జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
-తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వానాకాలం సాగు దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలను సమయానికి అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్ష తన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని విత్తన డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల నుంచే విత్తనోత్పత్తి చేపట్టి ఆధునీక ప్రయోగశాలల్లో నాణ్యత పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే ధృవీకృత విత్తనాలుగా మార్కెట్‌లో విడుదల చేస్తున్నామన్నారు. దీని వల్ల నకిలీ విత్తనాల సమస్య తగ్గి రైతులకు మెరుగైన దిగుబడులు లభిస్తాయన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో వరి సాగుకు సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న బిపిటి 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, కెఎన్‌ఎం 1638 వంటి సన్న రకాలతో పాటు కెఎన్‌ఎం 118, ఎంటియు 1000 వంటి దొడ్డు రకాల విత్తనాలు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతినిచ్చిన ధృవీకరించిన విత్తనాలను విక్రయించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరితో పాటు జిల్లాలో సాగు చేసే పెసర, మినుము, కంది పంటలకు సంబంధించి విత్తనాలను




కూడా సమృద్ధిగా సరఫరా చేస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో వరిసాగు లక్ష్యంగా పెట్టుకున్నామని దానికి అనుగుణంగా 30వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం సంస్థ ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలను (జిలుగు, జనుము, పిల్లిపెసర) సకాలంలో కావాల్సినంత పరిమాణంలో సరఫరా చేస్తామన్నారు. త్వరలో అమలులోకి రానున్న నూతన విత్తన చట్టం రైతులతో పాటు నిజాయితీ గల డీలర్ల ప్రయోజనాలను కాపాడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

6వ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సమాజంలో సజావుగా జీవించేందుకు చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పకుండా అవసరం అన్నారు ఆరవ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.శ్రీనివాసరావు. శనివారం స్థానిక మదర్ తెరిసా ఆటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయ సేవా అధికారం ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ చైతన్య సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరవ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. శ్రీనివాసరావు హాజరై విద్యార్థులకు న్యాయ వ్యవస్థ విధులు, సమాజంలో చట్టాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సమాజంలో సజావుగా జీవించేందుకు చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆయన పేర్కొన్నారు. యువత విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకొని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. అలాగే సమాజంలో నేరాలు, దొంగతనాలు, మహిళలపై దుర్వినియోగం వంటి సమస్యలను తగ్గించడంలో చట్టాలపై అవగాహన కీలకమని, మద్యం, ధూమపానం, మాదక ద్రవ్యాల వంటి వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వివిధ కోర్టుల విధులు, నేరాల తీవ్రతను బట్టి విధించే శిక్షలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరి కృష్ణ , సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ చలసాని సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. వి. రామచంద్ర , వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు , విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహాప్రస్థానం నిర్మాణానికి అఖిలపక్షం అంగీకారం

**ప్రజాపక్షం/మధిర :** ఐదున్నర ఎకరాల్లో మహా ప్రస్థానం నిర్మాణానికి అఖిలపక్షం అంగీకారం తెలిపింది. మధిర పట్టణంలోని శ్రీ మృత్యుంజయస్వామి ఆలయం వద్దనున్న హిందూ స్మశాన వాటికను మహాప్రస్థానంగా మార్చేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క రూ.9కోట్లు మంజూరు చేసిన సంగతి విధితమే. శనివారం స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో మహాప్రస్థానం నిర్మాణంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మహాప్రస్థానం అంశంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుత హిందూస్మశాన వాటికలో ఉన్న 108 సమాధులను తొలగించి మృతుల కుటుంబీకుల మనోభావాలు దెబ్బతినకుండా సమాధులపై ఉన్న శిలాఫలకాలను ఒకవైపు వరుస క్రమంలో అమర్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తెలిపాయి. మధిర పట్టణాభివృద్ధి దిశగా పర్యావరణ పరిరక్షణ, ఆహ్లాదకర వాతావరణం ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.9కోట్లు నిధులు మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మధిర అభివృద్ధికి నిరంతరం



కృషి చేస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, కమీషనర్ సంపత్‌కుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ నేత బెజవాడ రవిబాబు, మిర్యాల రమణగుప్తా, శీలం నర్సింహారావు, పారుపల్లి ఇజయ్, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

- ప్రియదర్శిని చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు
- విద్యాసంస్థలో వెల్లివిరిసిన హర్షాతిరేఖలు






**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మెరుగైన విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తానని ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు అన్నారు. శనివారం కళాశాలలో అభినందన సభను నిర్వహించారు. దీనిని హైదరాబాద్ జేఎన్టీయూ పాలకమండల సభ్యునిగా ఎన్నికకావడం పట్ల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌బాబు మాట్లాడుతూ...జేఎన్‌టీయూ హైదరాబాద్ పాలకమండలి సభ్యునిగా తనను నియమించినందుకు విశ్వవిద్యాలయ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇది తన వ్యక్తి గత గౌరవం మాత్రమే కాకుండా ప్రియదర్శిని విద్యాసంస్థలతో పాటు జిల్లాకు దక్కిన గౌరవంగా కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని ఉన్నత స్థానాలకు చేర్చడం తన లక్ష్యమని తెలిపారు. కృషితో నాస్తి దుర్భిక్షం అనే నమ్మకంతో ముందుకు సాగుతూ ఈ కొత్త బాధ్యతను మరింత బాధ్యతగా స్వీకరిస్తానన్నారు. అలాగే తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ, సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆనందోత్సహంగా కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. గోపాల్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, కళాశాల హెచ్‌ఓడిలు డాక్టర్ యం వెంకటేశ్వర రావు, ఐ.నరసింహారావు, డి. రమేష్, డాక్టర్ పి.విజయలక్ష్మి , ఐ. అనిత, ఎన్ జయమ్మ, జి. హరికృష్ణ, ఆర్‌విఎన్‌ఎస్ ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని రైతు వేదికలో శనివారం ఎమ్మెల్యే రాగమయి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. 23 గ్రామ పంచాయతీలకు 89 మందికి లబ్ధిదారులకు 89 లక్షల పదివేల 324 విలువచేసే చెక్కులను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వం అని, ప్రజా ప్రభుత్వంలో అందరూ సమానమేనని, అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ సమన్వయంగా చూస్తున్నామని వారు పేర్కొన్నారు. మరి కొంతమందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ లకు సంబంధించిన వారికి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మోహన్ నాయక్ మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజాదేవి తాసిల్దార్ బ్రహ్మేశ్వర రావు లతోపాటు సర్పంచులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నాణ్యతగా మధ్యాహ్న భోజనం

**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తుందని, పిల్లలు కూడా ఇష్టంగా తింటున్నారని దెందుకూరు సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మధిర మండలంలోని దెందుకూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ శ్రీనివాసరావు పరిశీలించి విద్యార్థులను ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత చాలా బాగుందని విద్యార్థులు తెలిపారు. వంట కార్మికులు భోజనం నాణ్యతగా వంట చేస్తుండటంతో ఎక్కువ మంది మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.శ్యామలారావు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# పోలిశెట్టిగూడెంలో చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం పోలిశెట్టిగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆదేశాల మేరకు అక్కడి పాఠశాల సమీపంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభ అనంతరం సర్పంచ్ కళ్లెం జాన్‌రెడ్డి మాట్లాడుతూ...ఎండాకాలంలో ప్రజలు దాహంతీర్చుకునేందుకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందన్నారు. ఇంతటి మంచి ఆలోచనకు కలెక్టర్ శ్రీకారం చుట్టడం అభినందనీయం అని కొనియాడారు. ఈ చలివేంద్రాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రజిత, పాఠశాల హెడ్‌మాస్టర్ జయరాజు, అంగన్వాడీ టీచర్ నిర్మల, గుమస్తా నాగరాజు, సిబ్బంది సాయిలు, జయరాజు పాల్గొన్నారు.



# ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని కాచిరాజుగూడెంగ్రామంలోని సెయింట్ విన్సెంట్ పల్లోట్టి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు...మారుమూల ప్రాంతంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభించి అతి తక్కువ ఖర్చుతో కార్పోరేట్ విద్యను అందిస్తుండం ఎంతో గొప్ప విషయంగా కొనియాడారు. ఇంతటి మంచి సదుపాయాన్ని చుట్టు పక్కల ఉన్న గ్రామస్థులందరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే స్కూల్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన కల్చరల్ ప్రోగ్రాంస్ ఆకట్టుకున్నాయి. అలాగే ఈ సందర్భంగా ఎస్ఐ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంటోనిబాలజోసెఫ్, ఫాదర్ సుధాకర్, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ ఉద్యోగులను వేసవి వడదెబ్బ నుండి రక్షించేందుకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీ నారాయణ తెలిపారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వేసవి కాలమంతా ప్రతి రోజు ఉదయం 11 గంటలకల్లా ఉద్యోగులకు మజ్జిగ అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి,వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, టి ఐ త్రీ జాకబ్, కాంతారావు, ఏ డి సి లు విజయ్ కుమార్, వెంకటయ్య, రమేష్,సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ నారాయణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



# సంక్షేమవారాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం : కలెక్టర్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అంకిత్ బదులిచ్చారు. శనివారం ప్రభుత్వప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు,సంక్షేమశాఖల అధికారులతో కలిసి సంక్షేమ వారంపై వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అయా సంక్షేమ శాఖల వసతి గృహాల్లో విద్యార్థులకు క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదులిస్తూ ఈనెల 20వ తేది నుండి 26వ తేది వరకు జిల్లాలో సంక్షేమ వారాన్ని నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ గురుకులాలు, వసతి గృహాల్లో వంటగది, పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడతామని, విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తామని తెలిపారు. రైతు రిజిస్ట్రీ 100పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జనగణనకార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 26 నుండి మే 10వ తేది వరకు స్వయంగా అన్ లైన్ చేసుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మే 11 నుండి జూన్ 9వ తేది వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని సూచించారు. ఈ కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుత్నుందున అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సిఇఓ నాగలక్ష్మి, సిపిఐ సంజీవరావు, గృహ నిర్మాణశాఖ పిడి రవీంద్రనాధ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు చక్కటి పోషకాహారం అందించాలి

**- ఎంఎల్ఏ, ఐటిడిఏ పిఓ**
**- గర్భిణీలకు ఘనంగా సీమంతాలు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** చిన్నారులు పోషకాహారాన్ని అధిగమించేందుకు ప్రతీ రోజు పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు అందించాలని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం దుమ్ముగూడెం మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలోని రైతువేదికలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోషణ్ పోషణ పక్వాడ్ అభియాన్ కార్యక్రానికి ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు, రక్తహీనత తగ్గించేందుకు, రోగ నిరోదక శక్తి పెంచేందుకు తప్పనిసరిగా చిరుధాన్యాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుండి ఆహారాన్ని తెచ్చి పిల్లలకు పెట్టవద్దని, ఇంట్లో సహజంగా తయారు చేసే ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలని, చిప్స్, కుర్‌కురే వంటి జంక్ ఫుడ్స్‌కు బదులు శనగలు, పప్పులు, పల్లీలు, నవ్వులతో తయారు చేసిన ఆహార పదార్దాలు ఇవ్వాలని, పండ్లతో పాటు ఆరోగ్య కరమైన స్నాక్స్ ఇవ్వాలని చెప్పారు. పోషకాహారంతో పాటు సరైన సమయానికి టీకాలు వేయించాలని చెప్పారు. అనంతరం ఐటిడిఏ పిఓ రాహుల్ మాట్లాడుతూ బేటీ పడావ్ బేటీ బచావో అనే సూత్రాన్ని ప్రతీ ఒక్కరూ పాటించాలని చెప్పారు. గర్భంలో ఉన్న శిశువు అడా, మగా అని తెలుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి తెలుసుకుని ఆడబిడ్డ అయితే గర్భాధారణ చేయించుకుంటున్నారని, అది మంచిపద్ధతి కాదన్నారు. పుట్టిన ప్రతీ బిడ్డకు ప్రభుత్వం అనేక రకాలు సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తోందని, చిన్నారులకు ఎక్కువ శాతం సులభ పద్దతిలో అరిగే ఆహారాన్ని ఇవ్వాలని చెప్పారు. చెక్కర, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి ద్వారా జ్ఞాపక శక్తి మందగిస్తుందని చెప్పారు. చిన్న పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం సరైంది కాదని, భవిష్యత్‌లో కంటి సమస్యలు తలెత్తడంతో పాటు అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం ద్వారా పిల్లల్లో మేధోశక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు గర్భిణీలకు సీమంతం నిర్వహించి బేటీ పడావ్ బేటీ బచావో కిట్లు, సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్వర్ణలత లెనినా, తహశిల్దార్ అశోక్ కుమార్, ఎంపిడిఓ వివేక్, సిడిపిఓ జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్ల ఒసీతమ్మ, ఏపిఎం జగదీష్, మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ, సర్పంచ్‌లు కుంజా కనక రత్నం, మట్ట వెంకటేశ్వర్లు, పొడియం సుబ్బారావు, కల్లూరి ఆదినారాయణ, వివిధ గ్రామాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దంచి కొడుతున్న ఎండలు

**- 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు నానాటికి పెరిగిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శనివారం జిల్లాలోని అశ్వాపురంలో 43.07 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యల్పంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత జూలూరుపాడు మండలంలో నమోదైంది. అడవులు విస్తారంగా ఉన్న ప్రాంతాల్లో సైతం భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. జిల్లాలోని జూలూరుపాడు మినహా మిగతా మండలాన్నీ 40 డిగ్రీల పై బడిన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అధికారులు ఆరెంజ్ జోన్ ప్రకటించారు. వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రానున్న ఏప్రిల్ 12 రోజులు, మే నెలలో అత్యధిగ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి మధ్యాహ్నా వేళల్లో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. వడబెద్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యలను సంప్రదించాలని చెబుతున్నారు.

# ఏళ్లుగా బేస్‌మెంట్ దశలోనే పంచాయితీ భవనం

**-అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కు ఆరోపణలు**
**-నిర్మాణం పూర్తి చేయాలని**
**ఎంపిడివో కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన**



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని రుక్కితండ గ్రామ పంచాయితీ భవనం ఏళ్ల తరబడి నిర్మాణ దశలోనే ఉండిపోవడంతో గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. శనివారం ఎంపిడివో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ, పంచాయితీ రాజ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం పంచాయితీ భవనం ఇప్పటికీ బేస్‌మెంట్ స్థాయిలో ఉండగానే బిల్లులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపిడివో సమక్షంలో పంచాయితీ ఏఈను ఫోన్ ద్వారా సంప్రదించగా, సరైన సమాధానం ఇవ్వలేదని తెలిపారు. సర్పంచ్ గుగులోత్ రమాదేవి, మాజీ జెడ్పిటిసి మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ వెంటనే నిర్మాణ పనులు పునఃప్రారంభించి భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. గ్రామ పంచాయితీ భవనం లేకపోవడంతో ప్రస్తుతం పాఠశాల భవనంలో సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇక భవన నిర్మాణానికి సంబంధించిన భూమి విషయంలో కూడా సమస్యలు తలెత్తినట్లుల గ్రామస్తులు తెలిపారు. గతంలో తండాను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేసి, భవనాల నిర్మాణానికి రూ 20లక్షలు మంజూరు చేసినప్పటికీ, పనులు పూర్తికాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణపై మెరుపు దాడి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. ఉప్పుసాక గ్రామం సమీపంలోని కిన్నెరసాని వాగు నుండి శనివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బూర్గంపాడు పోలీసులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వాటిని స్థానిక తహసీల్దార్‌కు అప్పగించి, మైనింగ్ శాఖకు బదిలీ చేశారు. మైనింగ్ శాఖ విధించే జరిమానా చెల్లించిన తరువాతనే ట్రాక్టర్లను విడుదల చేస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ రవాణా మళ్లీ చేస్తూ రూ 1లక్ష వరకు జరిమానా విధించడమే కాకుండా, చెల్లించకపోతే ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. మండలంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అధికారులు జారీ చేసిన కూపన్లు ఉన్న ట్రాకర్లకే అనుమతి ఉంటుందని, కూపన్ లేకుండా అభివృద్ధి పేరుతో ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సింగరేణి సూపర్ బజార్లపై నిర్లక్ష్యం

**- కార్మికులకు ఇబ్బందులు : వంగ వెంకట్**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** సంగరేణి సూపర్ బజార్లు అధికారులు, యాజమాన్యం నిర్లక్ష్యంతో దెబ్బతింటున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 కౌంటర్లతో సేవలు అందించిన సూపర్ బజార్లు ప్రస్తుతం 9 కౌంటర్లకే కుదించడం సరికాదని, వాటిలో నెల రోజులుగా సరుకులు లేక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మెట్రో సూపర్ మాల్ నుండి సరుకులు కొనుగోలు చేస్తూ చెల్లింపులు ఆలస్యం కావడంతో సరుకుల సరఫరా నిలిచిపోయిందని, క్రెడిట్ సౌకర్యం ఉన్నప్పటికీ సరుకులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గ్యాస్ సరఫరా అలస్యం, సిబ్బంది అక్రమాలు, పర్యవేక్షణా లోపంతో పరిస్థితి మరింత దిజగారుతోందని విమర్శించారు. గతంలో లాభాల్లో ఉన్న సింగరేణి సూపర్ బజార్లు ప్రస్తుతం నష్టాల్లో నడుస్తుండటం ఎంటని, ఈ పరిస్థితి ఎందుకు ఎదురైందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు సరైన పర్యవేక్షణ చేయడంతో పాటు నిత్యవసర సరుకులను తెచ్చి కార్మికులకు మేలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు 2400 రూపాయల మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. అనంతరం పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ పరిధిలో సిఎంఆర్ చెక్కులన లబ్ధిదారులకు పంపిణీ చేసిన కార్యక్రమానికి వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వెంకటరెడ్డి, సుమంత్ పడమటి నరసాపురం గ్రామ సర్పంచ్ సంగం లక్ష్మి కుమారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లేళ్ల గోపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీమిరెడ్డి క్షమాపణ చెప్పాలి

**-బీజేపీ నేత గుండా ఉపేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/కూసుమంచి:** దేశ ప్రధాని నరేంద్ర మోడిపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ నేత భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రధాని మోడీని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను వక్రీకరించి, ప్రధాని పట్ల అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. దేశ అభివృద్ధికి ప్రధాని మోడీ అహర్నిశలు కృషి చేస్తున్నారని, అలాంటి నాయకుడిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం తగదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల చర్యలు వారి రాజకీయ వైఖరిని ప్రతిబింబిస్తున్నాయని విమర్శించారు. భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంటనే తన తప్పును ఒప్పుకుని క్షమాపణ చెప్పాలని, లేకపోతే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేసి, లోపలికి వెళ్లనివ్వబోమని అన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**ప్రజాపక్షం/కూసుమంచి:** రాజుపేట గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈసందర్భంగా పశువైద్య సిబ్బంది గ్రామంలోని పాడి పశువులకు టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ మహేష్, ఉప సర్పంచ్ సోలిపురం ప్రభాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు బానోత్ దేశిరం, అప్పనపురి లక్ష్మి, పశువైద్య అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**-మోక్షిత నిధి ఫౌండేషన్ సేవలు అభినందనీయం**

**-మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ**








**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో మోక్షిత నిధి ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీరామోజి ఉప్పలాచారి వేసవి కాలంలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ చలివేంద్రాన్ని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆర్‌టిసి బస్టాడ్ ప్రాంగణంలో ప్రయాణీకులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ మోక్షిత నిధి ఫౌండేషన్ ద్వారా ప్రయాణీకుల సౌకర్యార్థం బస్టాండ్ ఆవరణలో త్రాగునీటి కోసం మినరల్ వాటర్ ఏర్పాటుతో చలివేంద్రాం ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామని అన్నారు. అదేవిధంగా ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉన్న ప్రయాణీకులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. గతంఓల కూడా మోక్షిత ఫౌండేషన్ ఆద్వర్యంలో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం నూతన టెక్నాలజీ విధానంలో ట్రైనింగ్ ఇచ్చి వందలాది మందిని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేందుకు ప్రోత్సహించిన మోక్షిత ఫౌండేషన్ నిర్వాహకుడు ఉప్పలచారిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ నిధి ఫౌండేషన్ ద్వారా ఎండలు విపరీతంగా ఉన్న సమయంలో ఆర్‌టిసి బస్టాండ్‌లో చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఉప్పలచారి ప్రజల గురించి ముందస్తుగా మంచి ఆలోచనతో చలివేంద్రం ఏర్పాటు చేశారు అని తెలిపారు. అనంతరం ఉప్పలచారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను కమ్యూనికేషన్ స్కిల్స్ డవలప్‌మెంట్ చేయించి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు వారిని ప్రోత్సహించేందుకు ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. పెద్దలు సహకారంతో సూచనలతో ఈ ట్రైనింగ్ సెంటర్‌ను నడుపుతున్నాం, అదేవిధంగా సేవా కార్యక్రమాలు చేసేందుకు కూడా ముందుకు వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎస్‌ఎం బాలబోయిన వెంకటేశ్వరరావు, రాచకొండ సాయికుమార్, ఉయ్యూరు రామకృష్ణ, చెరుకూరి శ్రీనివాసరావు, గరిడేపల్లి కిషోర్, బానోతు రవిచంద్ర, చింతపల్లి భాస్కర్‌రావు, నల్లపాటి నరసింహరావు, గుగులోతు నర్సింహారావు, గోంగూర రామారావు, శీలం నర్సింహారావు, ఉదారపు పూర్ణచంద్రరావు, తోటకూరి సాయి ప్రసన్న, మనుబోలు స్వప్న, వడ్లకుంట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన లోపంతోనే చట్టాలు అమలు శూన్యం

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** దేశంలో చట్టాలు రోజురోజుకి కఠినతరం అవుతున్నా వాటి అమలు విషయంలో జీరో ఎన్ఫోర్స్‌మెంట్ పరిస్థితి నెలకొందని సిఐ నాగరాజురెడ్డి అన్నారు. చట్టాలు పుస్తకాలకే పరిమితమవడం తెలిసిన వారు సైతం పాటించకపోవడంతోనే అమలు కాని పరిస్థితి ఏర్పడితే అది సమాజానికి ముప్పుగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీస్‌శాఖ కార్యచరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జీరో ఎన్ఫోర్స్మెంట్ విధానంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా నియోజకవర్గం కేంద్రమైన అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రతి వాహనాన్ని నిలిపి తనిఖీలు చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా తగిన చర్యలు లేకపోవడం ప్రజల్లో చట్టాల పట్ల నిర్లక్ష్యాన్ని పెంచుతోందని అన్నారు. చట్టం ఉంది కాని అమలు లేదు అన్న భావన ప్రజల్లో బలపడుతోందని అన్నారు. చట్టం అమలు సంస్థలు కఠినంగా వ్యవహరించకపోతే చట్టాల ఉద్దేశ్యం



నెరవేరదని వారు వాహనదారులకు హెచ్చరించారు. మొత్తం వందకు పైగా ద్విచక్ర, ఇతర వాహనాలు తనిఖీ చేయగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు 50 గుర్తించామని, హెల్మెట్ వాడని, త్రిబుల్ డ్రైవింగ్ వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ ఎస్సై యయాతి రాజు, ఎస్సై అఖిల, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయొద్దు

**కమీషనర్‌కు గురులింగంకు వినతి**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 15వ వార్డు పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రభుత్వం తలపెట్టిన పనులను నిలిపివేయాలని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్స్ కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్‌రావు, అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమీషనర్ గురులింగంకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్స్ కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రతి ఏటా దాదాపు 1600 మంది విద్యార్థులకు తగ్గకుండా నిరంతరాయంగా ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అభ్యసిస్తున్నారు. అటువంటిది ఈ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు అనే విషయం ఇటు పాఠశాల యాజమాన్యానికి, పిల్లలను చాలా ఆందోళనకు గురిచేయడమే కాకుండా పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ వ్యర్థాల నుండి వెలువడే ఉద్గారాలు విషపూరితంగా బ్యాక్టీరియాలను , వైరస్‌లను విడుదల చేస్తాయి. వాటి వలన పిల్లల ఆరోగ్యానికి పెను ప్రమాదం పొంచి ఉంది. కాలుష్యమైన వాయువులను పీల్చడం వలన పిల్లలకు దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, హానికరమైన క్యాన్సర్ కణాలు పిల్లల శరీరంలోకి ప్రవేశించడానికి అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్స్ కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ,ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి కౌన్సెలింగ్

**ప్రజాపక్షం/వైరా:** వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవాలని వైరా ఎస్సై రామారావు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైరాలో అరైవ్ అలైవ్ వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారుల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి,రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీస్‌శాఖ కౌన్సిలింగ్ కార్యక్రమాలను చేపడుతున్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనడం ననపడం, అతివేగం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలతో పాటు ఈ కౌన్సిలింగ్ ద్వారా అవగాహన నిర్వహించారు.




# నేడు ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్ ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం నగరంలోని వినోద థియేటర్ సమీపంలో ఖమ్మం గ్యాస్ట్రో నూతన హాస్పిటల్‌ను అదివారం ప్రారంభించనున్నట్లు ప్రముఖ వైద్యులు, శ్రీరక్ష హాస్పటల్ ఆధినేత గోంగూర వెంకటేశ్వర్లు, మెడికల్ గ్యాస్ట్రో ఏంటారాలోజిస్ట్ డాక్టర్ ముదిరెడ్డి అనిమేష్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హాస్పిటల్‌ను వ్యవసాయ, చేనేత, జౌళిశాఖ మంత్రివర్యులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీరితో ముఖ్య అతిథులుగా ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఖమ్మం ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించేందుకు ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్‌ను ప్రారంభించున్నట్లు తెలిపారు. హాస్పిటల్ నందు గ్యాస్ట్రో ఎంటరాలజీ చికిత్స, ఎండోసోపీ, కొలోనోస్కోపీ, ఈఆర్‌సిపి, లివర్ వ్యాధుల చికిత్స, పాంక్రియాటైటిస్, సర్జికల్ గ్యాస్ట్రో, అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపిక్ గైనకాలజీ సర్జరీలు, జీర్ణకోశ శస్త్రచికిత్సలు అందించబడుతుంది. దీంతో పాటు క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ, ఎండోగైనకాలజీ, కిడ్నీ డయాలిసస్ సేవలు అందించబడుతుందని తెలిపారు.

# వెంకటేశ్వరునికి ఘనంగా సర్వాంగాభిషేకం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారు అమ్మవార్లకు శనివారం ఘనంగా సర్వాంగాభిషేకం, అర్చనలు నిర్వహించారు. ముత్యాల అలంకార రూపంలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేకువజామునే స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం చేశారు. స్వామి వారికి అమ్మవార్లకు నిత్య కళ్యాణం ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం కావడంతో ఆలయానికి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఖమ్మం జిల్లా మధిర సుందరయ్యానగర్‌కు చెందిన వేమిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనురాధ దంపతులు స్వామి వారి నిత్య అన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన భక్తలకు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, ముఖ్య అర్చకులు ఎం.వెంకటరమణ, మురళీమోహన్‌శర్మ, రామకృష్ణశాస్త్రి, రాజీవ్ శర్మ, విజయకృష్ణ సాయి అభిలాష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో యువకుడు అనుమానాస్పద స్థితి మృతి చెందిన సంఘటన జరిగింది. బోనకల్ మండలం స్టేషన్ బోనకల్‌కు చెందిన లింగం కార్తీక్(20) అనుమానాస్పదంగా మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. సమాచారం ప్రకారం కార్తీక్ ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై వెంకన్న సంఘటన స్థలాన్ని పరిశీలించి అన్నికోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన కార్తీక్ అమ్మమ్మ వద్దనే పెరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎంతో ముద్దుగా పెరిగిన యువకుడు ఒక్కసారిగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈఘటనకు గల అసలు కారణాలు ఏమిటన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# బ్రాహ్మణపల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన




**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రణాళికలో భాగంగా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై పొదిలి వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించగా సిఐ మధు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ కట్టుకోవడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, వేగ పరిమితులు పాటించడం వంటి ట్రాఫిక్ నియమాలను తప్పసరిగా పాటించాలని సూచించారు. సిఐ మధు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత అని, నియమాలను పాటించడం ద్వారా కుటుంబాలను, సమాజాన్ని కాపాడవచ్చని తెలిపారు.ముందుగా గ్రామసర్పంచ్ ఆధ్వర్యంలో కొంతమంది వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పొదిలి వెంకన్న, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ఇతర గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులదగ్గర అక్రమంగా డబ్బులు వసూలుచేస్తే సహించేదిలేదు

**రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మొక్కజొన్న రైతులు దగ్గర ధాన్యం ట్రాన్స్‌పోర్టులో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే సహించేదిలేదని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటిసి దొండపాటి రమేష్, జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆరుగాల కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుచేసి రైతులకు అండగా ఉండాల్సిన సమయంలో ట్రాన్స్‌పోర్టు అక్రమ కొరతను సృష్టించి కొంతమంది వ్యక్తులు రైతుల వద్దనుంచి డబ్బులు ఇస్తేనే లారీలు వస్తున్నాయని రైతులను ఆందోళనపరిచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా మార్క్‌ఫెడ్ అధికారికి శనివారం ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అకాల వర్షాలు, గాలిదుమ్ములు వచ్చే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని మొక్కజొన్న ధాన్యం రైతులు నష్టపోకుండా ధాన్యం ట్రాన్స్‌పోర్టుకు ప్రత్యేక చర్యలు తీసుకొని మొక్కజొన్న ధాన్యాన్ని ఎగుమతులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు.